ఎన్నికలు

# కొంతమంది ఓడిపోవడం అవసరం

- కె. బాలగోపాల్

పట్టించుకోవడం వృధా అనుకుంటూ కూడ పట్టించుకోక తప్పని ప్రక్రియలలో ఎన్నికలొకటి. ఈసారి అసెంబ్లీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కోటి రూపాయలు తగ్గే ప్రసక్తి లేదని అందరూ అంటున్నారు. చంద్రబాబయితే మిగిలిన ఖర్చంతా పోను పోలింగ్ రోజున వోటుకు వెయ్యి రూపాయలు ఇవ్వబోతున్నాడని కూడా వినికిడి. మనది ఇప్పటికింకా విశ్వాసం గల జాతే కాబట్టి తీసుకున్నాక వేయక పోరని అతని ధీమా కాబోలు.

అటువంటి ఎన్నికల గురించి ఆలోచించడం ఎందుకు అంటే, అటువంటి ఎన్నికలే మన పాలకుల్ని నిర్ణయిస్తున్నాయి మరి. ఆలోచించక ఏం చేయాలి? రెండవది, ఎన్నికలు డబ్బు చుట్టూ తిరుగుతున్నాయనేది ఎంత వాస్తవ మైనా, గెలుపును నోట్లే తప్పనిసరిగా నిర్ణయిస్తాయన్న గ్యారంటీ ఏమీ లేదు. నిజానికి రాబోయే ఎన్నికలే ఈ నమ్మకానికొక పరీక్ష కావచ్చు. తెలుగుదేశం పార్టీ విపరీతంగా ఖర్చు పెట్టబోతున్నదనేది అందరూ ఎరిగిన విషయమే. ప్రపంచ బ్యాంకు ఏ ఖాతాకూ చెందని 'అప్పు' అందుకోసం చంద్రబాబుకు ఇచ్చిందని కూడా వినికిడి. కాంగ్రెస్ దగ్గర, తెలంగాణ రాష్ట్ర సమితి దగ్గర పైసలు లేక పోలేదు. ఖర్చు విషయంలో వాళ్లేమీ మడిగట్టుకొని కూర్చోలేదు. అయితే ప్రస్తుత పరిస్థితులలో వారు చంద్రబాబుకు ఈ విషయంలో పోటీకి రాలేరు. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ ఓడిపోయే సూచనలు బలంగానే కనిపిస్తున్నాయి. మూడవది, ఎన్నికల వ్యవస్థను పట్టించుకుంటేనే అది రేపెప్పుడయినా బాగుపడుతుంది.

కారణం ఏమయితేనేం, మామూలుగా ఎన్నికలపేరు చెబితేనే ఈసడించుకునే వారితో మొదలుపెట్టి సమాజాన్ని గురించి కనీస స్పృహ ఉన్నవాళ్లందరూ ఈసారి ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు మన అతిశయం కొద్దీ 'చరిత్ర ఒక కీలకమైన మలుపు వద్ద ఉంది' అని అంటూంటాంగానీ, నేడు నిజంగానే అటువంటి మలుపు వద్ద ఉందన్న భావనే ఈ ఆసక్తికీ చొరవకూ కారణం కావచ్చు.

రాష్ట్రంలో చంద్రబాబు గెలుపు, కేంద్రంలో భారతీయ జనతాపార్టీ గెలుపు, వర్గ సిద్ధాంతాన్నీ వర్ణసిద్ధాంతాన్నీ అపహాస్యం చేస్తాయన్న అనుమానం అన్ని రకాల అభ్యుదయ వాదులనూ పీడిస్తున్నదనుకుంటాను. పేదలకు నూరుపాళ్లు వ్యతిరేకమైన విధానాలను ప్రకటించి అమలు చేసే పార్టీ ఒకసారి కాదు, రెండు సార్లు కాదు, మూడుసార్లు గెలవడమా! బ్రాహ్మణీయ వర్ణ ధర్మాన్ని మోసే పార్టీ గెలుచుకుంటూ పోవడమా! ఎక్కడో ఏదో పెద్దలోపమే ఉంది.

ఆ లోపం ఎక్కడుందన్న విశ్లేషణ నేను ప్రస్తుతం చేయబోవడం లేదు. అయితే మరొక్కసారి ఈ ప్రజావ్యతిరేక శక్తులు గెలవడం జరిగితే అది చరిత్రలో పెద్దమలుపే అవుతుంది. కాంగ్రెస్ వీరికంటే ఏ విషయంలో మెరుగయినది అని అడగొద్దు. కాంగ్రెస్ అమీబావంటిది. దాని స్వరూపం ఫలానా అని చెప్పలేం. అయితే ఇక్కడ సమస్య రేపు రాష్ట్రంలోనూ దేశంలోనూ కాంగ్రెస్ గెలిస్తే ఏమైనా మార్పు వస్తుందా లేక ఇప్పుడున్నట్టు ఉంటుందా అనేది కాదు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రకటించి అమలు చేసే వాళ్ళకు వోటు ద్వారా బుద్ధి చెప్పే రాజకీయ పరిణతిని సమాజం ప్రకటించడం అవసరం. ఆ వోట్లలో ఎన్ని నోటుకూ సారాయికీ అమ్ముడు పోతున్నప్పటికీ ఇది జరిగే పరిణతి సమాజంలో ఉందన్న సందేశం రాజకీయ పార్టీలకు అందడం దానంతటదే ఒక మేలు. ఆ సందేశం అందక పోయినట్టయితే, ప్రజావ్యతిరేకతను ప్రకటించుకొని అమలు చేయడంలో అవివేకత ఏమీ లేదన్న ధీమా రాజకీయ పార్టీలలో పెరిగి పోతుంది. యాభై ఏళ్లుగా అది అవివేకం అనుకుంటూ వస్తున్నారు భారతదేశంలోని రాజకీయ వేత్తలంతా. కాదని సమాజం చెప్పేస్తే చాలా నష్టం జరిగిపోతుంది. ఆ అర్థంలోనే దేశ రాజకీయాలీరోజు మలుపు దగ్గర నిలబడ్డాయి.

దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడ ఒక తప్పుడు సంకేతం పంపించే ప్రమాదం నుండి చరిత్రను మనం తప్పించవలసిన అవసరం ఉంది. 'నయా ఉదారవాదం' అనే మూర్ఖమైన పెట్టుబడిదారీ సామాజిక ఆర్థిక నీతికీ రాజకీయ ఉదారవాదానికీ చుక్కెదురు అన్న అభిప్రాయం దక్షిణ, మధ్య అమెరికా దేశాల అనుభవం నుండి బలం పొందింది. పూర్తిగా వామపక్షవాదులు కానివారు ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌ల నీతిని ఈ వాదనతోనే ఎదుర్కొంటున్నారు. ఈ సంస్థలు ముందుపెట్టే నమూనాలో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన అనేక సమాజాలలో రాజకీయ ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ, చట్టబద్ధ పాలన ఇత్యాది విలువలు, వ్యవస్థలు త్వరలోనే భూస్థాపితం అయ్యాయి. నియంతృత్వ పోకడలు బలపడ్డాయి. ఈ కారణంగా ప్రపంచబ్యాంకు మార్కు ఆర్థిక సంస్కరణల విషయంలో రాజకీయ ఉదార వాదులు, ప్రజాస్వామ్యవాదులు అత్యుత్సాహంగా ఉన్నారు.

ఎన్నికలు సజావుగా జరుపుకుంటూ పత్రికలను స్వేచ్ఛగా రాయనిస్తూ, ప్రజలకు కూడ ఎప్పుడూ కాకపోయినా అప్పుడప్పుడయినా

(తరువాయి 19వ పేజీలో)

చేస్తామంటూ అరచేతిలో స్వర్గం చూపిస్తూ పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టి ప్రభుత్వ నిధులను, ప్రచార సాధనాలకు దుర్వినియోగం చేస్తున్నారు. "ఫల్‌గుడ్" "ఇండియా షైనింగ్" ప్రచారాల ఖర్చు 400 కోట్ల రూ.లకు పెరిగింది. ఇట్లా ప్రజాధనాన్ని వృధా చేయడం దారుణం. "దేశం మెరుస్తున్నదని "వెంకయ్యానాయుడు, వారి మిత్రుడు చంద్రబాబు నాయుడు ఊదరగొట్టేదంతా పచ్చి బూటకం. దేశంలో అవినీతి, దళారీ దోపిడి, సామాజిక రంగాల ప్రైవేటీకరణ రాష్ట్రాల మధ్య ప్రాంతాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. సంక్షేమ కార్యక్రమాలపై బడ్జెటు కేటాయింపులు వ్యయం తగ్గిపోయి ఈ వర్గాలకు చెందిన వారు ఆకలి చావులకు గురవుతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నిరుద్యోగం దారిద్ర్యం కుల వివక్ష, అంటరాని తనం అణచివేతలకు గురి అవుతున్నారు. కూలీలు వలసలు పోతుంటే నిరుద్యోగం యువకులు వయోవృద్ధులవుతూ జీవితాలు దుర్భరంగా మారుతూంటే "మాకు సంస్కరణలూ వద్దు, ఈ అభివృద్ధి వద్దు" అంటున్నారు.

రాజకీయ అవినీతి విషయానికి వస్తే ఎన్‌డిఏ హయాంలో శవపేటికల కొనుగోలు కుంభకోణం, ప్రభుత్వ కంపెనీలను చౌకబారు ధరలకు అమ్మిన కుంభ కోణం, తెహల్కా కుంభకోణం, నకిలీ స్టాంపుల (32,000 కోట్ల రూ.లు) కుంభకోణాలు దేదీప్యమానంగా మెరుస్తున్నాయి ఇదంతా "ఫీల్‌గుడ్" దుర్గతి కాదా!

దేశాన్ని పాలించిన పాలిస్తున్న, పాలించబోయే రాజకీయ పార్టీలు గమనించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటింటికి జరిపిన సర్వే ఆధారంగా (వెలుగు సర్వే) 55% కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు స్పష్టం అయింది. అంకెల గారడీ చేసి పేదరికం తగ్గింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య తగ్గింది అంటూ చేసే ప్రకటనల్లో, బారత్ వెలిగి పోతుంది, అంతా బాగుంది అనే ప్రచారంలో వాస్తవంలేదు. హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో ఇండియా 173 దేశాల్లో 124 వ స్థానంలో వుంది. ఇది వెలిగిపోవడం కాదు. చీకటిలో మునిగిపోవడం అవుతుంది. వైద్యరంగం తీవ్రనిరాదరణకు గురైంది. విద్యా రంగాన్ని మధ్యతరగతి కూడా అందని స్థాయిలో వాణిజ్య మయం చేసారు. ప్రపంచ నిరక్షరాస్యుల్లో 30% ఇండియాలోనే వున్నారు. వాజ్‌పేయి, చంద్రబాబు ప్రభుత్వాలు, వ్యవసాయ రంగం అభివృద్ధికి ఎన్ని సాగునీటి ప్రాజెక్టులు చేపట్టినాయి. ఎన్ని మిలియన్ల హెక్టార్లకు అదనంగా సాగునీరు లభించింది? ఎంతమంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు? ప్రజాధనంతో 400 కోట్ల రు. పెట్టి ప్రచారాలు చేస్తూంటే ఇండియా ప్రకాశిస్తుందా! పిల్లలకు పాలు, వారానికి ఒక గుడ్డు ఇవ్వలేని కుటుంబాలు 90% ఉండి, మంచినీరు కొనుగోలు చేసుకునే దుర్దశ ఈ దేశంలో ఉందని ఎన్డీయే, టిడిపి పార్టీలు గుర్తించాలి. ప్రపంచబ్యాంకు ఆదేశాలతో అమలు పరుస్తున్న ఆర్థిక సంస్కరణల దుష్పరిణామాలు భరించలేక దేశంలో పేద ప్రజలు తల్లడిల్లుతున్నారు. నూతన ఆర్థిక విధానాల పేరిట దేశాన్ని బహుళజాతి గుత్త సంస్థలకు, సామ్రాజ్య వాదులకు తాకట్టు పెట్టి "ఫీల్‌గుడ్" అంతా బాగుంది, అనే నినాదాలు ప్రచారం చేస్తున్నా దానిని ఎవరు నమ్ముతారు?

☆ ☆ ☆

(20వ పేజీ తరువాయి)

రాజకీయ భావ ప్రకటనా స్వేచ్ఛను అనుభవించే అవకాశాన్నిస్తూ కూడ 'సంస్కరణలను' అమలు చేసేయవచ్చునని మనం రుజువు చేసేస్తే, 'సంస్కరణలను వ్యతిరేకించే ఒక బలమైన వాదనను' అబద్ధం చేసిన వారమవుతాము. అది అబద్ధమైతే ఆ విషయం రుజువు కావడంలో తప్పేముంది అంటారేమో. అది అబద్ధం కాదు. అనేక దేశాల అనుభవమే కాక సాధారణ తర్కం కూడ ఈ విషయాన్ని రుజువు చేస్తుంది. డబ్బు కారణంగానో సారాయి ప్యాకెట్ల కారణంగానో ఊదర గొట్టే ప్రచారం కారణంగానో మీడియా మానేజ్‌మెంట్ కారణంగానో అబద్ధం కానిది అబద్ధమని రుజువు కావడం అవాంఛనీయం.

సంఘపరివార్ అమానుషత్వం కొంత కాలం కొంత మందికి ఆమోదనీయంగా కనిపించడమే కాదు, దీర్ఘకాలం సగటు మనుషులకు అనభ్యంతరంగా కనిపిస్తుందనీ, కనిపించగలదనీ నమ్మాలంటే మానవత మీద విశ్వాసాన్నే వదులు కోవాలి. దీనికి సహితం సిద్ధపడవలసిందేనా? ఆ మలుపు దగ్గర కూడ మనం ఉన్నాం. గుజరాత్‌తోనే ఆ విషయం స్పష్టం అయింది. అంతటి మారణ కాండ తరువాత కూడ సగటు గుజరాతీలు పెద్దెత్తున వోట్లువేసి నరేంద్రమోడి ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించారు. ఆ గెలుపుకు భుజాలు చరచుకుంటూ 'గుజరాత్ ప్రయోగాన్ని' దేశమంతటా అమలు చేస్తాం అంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు నిర్లజ్జగా ప్రకటించారు. దానిని దేశమంతటా అమలు చేయడం అంటే అర్థం ముస్లింలను పెద్ద ఎత్తున చంపడమే కానక్కరలేదు. మైనారిటీలను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచి దేశాన్ని పరిపాలించడం. ఎప్పుడయినా ఏ కారణంగా నయినా తమ మీద కోపం వస్తే మూకుమ్మడిగా చంపుతారు అన్న భయంలో మైనారిటీలను ఉంచి పరిపాలించడం. ఆ విషయం ప్రకటించి మరీ వాళ్ళు ఎన్నికలలో గెలవగలిగితే సగటు మనుషుల మానవత గురించే మనకు సందేహం రావలసి ఉంటుంది. ఇండియా వెలిగిపోతున్నది అన్న అర్థరహితమైన నినాదపు ఆచ్ఛాదన వెనుక ఈ అమానుషత్వాన్నంతా దాచడం సాధ్యం అని రుజువయినట్టయితే సగటు మనుషుల వివేచనపైన కూడ విశ్వాసం కోల్పోవలసి ఉంటుంది. ఈ స్థితి రావడమూ అవాంఛనీయమే.

అందుకే ఎవరు గెలిచినా ఒకటేనని ఎప్పటిలాగే అనుకున్నా, కొంతమంది ఓడిపోవడం అవసరం అనే స్పృహతో ఈ ఎన్నికలను ప్రగతి శీల శక్తులంతా సీరియస్‌గా తీసుకుంటున్నారు. అది రైటే.

☆ ☆ ☆